# ఫలించిన జోస్యం

**కథానిక**

పి. వి. శ్రీపతిరావు

"రండి సార్! రండి! పది పైసలే నండి. జరగబోయేది తెలుసుకోండి! చేతిలోని అదృష్టం తెలుసుకోండి! ఈ రోజు కాలి నడకన పోతారు, అదృష్టం కలిసొస్తే రేపు కారులో వెళ్తారు! జరిగింది, జరుగుతున్నది, జరగబోయేది ఒక్క పది పైసలుకే చెబుతానండి. ఒక్క పది పైసలతో అనుకుంటోన్న పని జరుగుతుందో, లేదో తెలుసుకోండి!"

రోడ్డు పక్కన పేవ్‌మెంటు మీద నిలబడి అతను అరుస్తున్నాడు. చుట్టూ జనం బాగా మూగి ఉన్నారు. అందరూ నాలా బస్సుకోసం ఎదురు చూస్తున్న వాళ్ళేనేమో! బస్సు రావడానికింకా చాలా సేపవుతుంది. కాలక్షేపం కోసం నేనూ వెళ్ళి నిలబడ్డాను.

అప్పటికే అతను ఒక కుర్రాడి చెయ్యి చూస్తున్నాడు. ఆ కుర్రాడి నిక్కరు, మాసిపోయిన బనీను, వాటి మీద పిండి మరకలు – హోటల్లో క్లీనరు కుర్రాడులా వున్నాడు.

"చిన్నతనం నుంచీ కష్టాలు నిన్ను వెంటాడుతునే వున్నాయి. నువ్వు చేసే పనిలో జాగ్రత్త అవసరం. కత్తిమీద సాములాంటి వుద్యోగం. సంచారంలో శనివున్నా, గురువు ప్రభావం అధికంగా వుంది. కాబట్టి చిన్న చిన్న అడ్డంకులు వచ్చినా, వాటికవే పోతాయి. గురువు ప్రభావం చేత వృత్తిలో పైకి పోగల అవకాశాలు హెచ్చుగానే వున్నాయి. అయితే సంపాదించిందంతా ఎప్పటి కప్పుడే ఖర్చుపెట్టే చెయ్యి నీది" అంటూ చుట్టూవున్న జనాని కర్థమయ్యా, కాని గ్రహాల భాషలో చెబుతున్నాడు.

ఆ కుర్రాడు మాత్రం, అప్పుడే తాను సర్వరు అయిపోయినట్లు భావించుకుని, పావలా కాసుని అతి విలాసంగా అతని కందిచాడు – ప్రమోషనొస్తే సర్వర్ అయ్యాక వచ్చే టిప్పును తలుచుకుని మురిసిపోతూ!

జోతిష్కుడు చూడ్డానికి లావుగా, తారు డ్రమ్ముకు బట్టలు చుట్టబెట్టి నట్టున్నాడు. కళ్లకు మందమైన అద్దాలు, నుదుటి మీద అడ్డంగా మూడు విభూతి రేఖలు, మధ్యగా ఎర్రబొట్టు, చేతిలో భూతద్దం – వాలకం చూస్తూంటే దెయ్యాల చేత సర్కస్ చేయించే రింగు మాస్టరు మాదిరిగా కన్పిస్తున్నాడు. మనిషి ఎలావున్నా, రావు గోపాల్రావు గొంతులాంటి అతని గంభీరమైన బొంగురు గొంతు ప్రజల నాకర్షిస్తోంది. మాటలు బాగా చెలామణీ చేస్తున్నాడు.

అతనికి యిరు ప్రక్కలా రక్షక భటుల్లా, రెండు అట్టలు ఎదురు బద్దల మీద నిలబడి వున్నాయి. అట్టల మీద 'హస్తం' వుంది. ఆ వెనక గోడ మీద మూడు ఫోటోలు. వాటిల్లో ఒకటి – ఒక విశ్వనట చక్రవర్తితో, రెండోది విశ్వవిఖ్యాత నటసామ్రాట్టుతో అతను దిగిన ఫోటోలు. మూడు రోజుల మంత్రి వర్గంలోని, ఒక మంత్రిగారి చెయ్యి పట్టుకుని – కెమెరావైపు చూస్తూ మూడో ఫోటో! దానికింద 'జ్యోతిశ్శాస్త్ర విద్వాన్' అన్న బిరుదుతో తన పేరు. ఆ వెనక [illegible]

నాలుగైదు డిగ్రీలు.

తరువాత పక్క బంకుల్లో టీ తాగి, కిళ్ళీ బిగించి, బీడి కాలుస్తూ చుట్టూ వున్న జనానికి ఇందిరా గాంధీకి ఎన్నికల గుర్తు 'హస్తం' కేటాయించి వుండక పోతే ఆమె చెయ్యి పైకి లేచేది కాదంటూ చెయ్యెత్తి మరీ, హస్త మహాత్యం వివరిస్తున్నాడు జ్యోతిశ్శాస్త్ర విద్వాన్.

ఇంతలో సన్నగా, చెరుగ్గడలా, చిరుగులు పట్టిన లాల్చీ, మాసిపోయిన పంచె, తైల సంస్కారం లేని జుట్టుతో అదృష్టం వెతుక్కుంటూ ఒకతను వచ్చాడు. వచ్చీ రావడంతోనే పది పైసలు బిళ్ళ లాల్చీ జేబులోంచి తీసి, జ్యోతిష్కుడి పుస్తకం మీద పెట్టాడు. చెరుగ్గడ చెయ్యందుకుని, కళ్ళజోడును ముక్కుచివరకు అనించుకుని, భూతద్దాన్ని తువాలుతో తుడిచి, అరిచేతి మీద అటూ, యిటూ తిప్పుతూ, ముక్కుదగ్గర నుంచి చెయ్యిదాకా భూతద్దాన్ని నడిపిస్తూ సీరియస్‌గా పరీక్ష సాగింది.

చెరుగ్గడ ముఖంలో పరీక్ష రిజల్టు కోసం ఎదురు చూసే విద్యార్థి ఆతృత. చెయ్యిచూడడం ఆపి, గ్రహాల డైలాగులు వల్లింపు జరిగింది. "అయితే నీ అరిచేతిలో ధనరేఖ ట్రంకు రోడ్డులా వెడల్పుగా వుంది. కాబట్టి శాస్త్రరీత్యా ఎప్పుడూ నీ చేతిలో డబ్బాడుతూ వుంటుంది. రవి ప్రభావంచేత రాగల రెండు రోజుల్లో ఆకస్మిక ధనలాభం. అయితే నువ్వు కొంచెం కష్టపడవలసి వుంటుది. ఈ రెండ్రోజులూ తెలివిగా కనుక వ్యవహరించావంటే నీ దశ మారిపోయే అవకాశముంది".

స్విచ్ వేస్తే వెలుగు పుట్టినట్టు, అతని ముఖంలో చివరి మాటలు వెలుగు పుట్టించాయి.

జ్యోతిష్కుని ఆశల అమ్మకం, ఎన్నికల్లో వాగ్దానాల అమ్మకం జోరులో సాగిపోతోంది.

ఇంతలో నే నెక్కవలసిన బస్సు వచ్చింది. పరుగుపరుగున బస్సులో చొరబడ్డాను.

రెండ్రోజులు పోయిన తరువాత అదే బస్టాండులో బస్సు ఎక్కేనో లేదో, హఠాత్తుగా, పెద్దగోల.

"కొట్టండి! చంపండి వెధవని" అంటూ దూరంగా ఓ గుంపులో అరుపులు, దబదబా చప్పుళ్లు. "నిన్నటి వరకూ యీ బస్టాండులో అడుక్కొంటుండే వాడండీ! పిదప కాలం — పిదప బుద్ధులూనూ! ఎవరో పెద్ద మనిషి బస్సెక్కుతూంటే జేబులో పర్సు కొట్టేశాడు. చూస్తే అడుక్కునే వేషం — చేసేది దొంగతనమూనూ!" గుంపులో ఒకడు ఆవేశంతో చెప్పుకపోతున్నాడు.

తలొంచుకుని దెబ్బలు కాసుకొంటూ చెరుగ్గడ!

పేవ్‌మెంటు మీద అందరితో పాటు ఫలించిన తన జోస్యాన్ని చూస్తోన్న జ్యోతిశాస్త్ర విద్వాన్.

సఫల జీవితానికి సరిగ్గా సరిపడుతుందా అని చూడడానికి అది జీవితానికి నకలు కాదు. జీవితంలో ఒక భాగానికో, ఒక అంశానికో అది కృతక సులభ రూపకల్పన మాత్రమే. ఆ రూపకల్పనలోనే దాని విజయమో, వైఫల్యమో వుంటుంది.
(ఎమిలీ జోలా).